క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

బద్వేలు అర్బన్ : స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంటట్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల పరిపాలన అధికారి ఆర్.వి.సాయికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అపోలో, డాక్టర్ రెడ్డీస్ గ్రో ఇవి, హెట్రో డ్రగ్ లిమిటెడ్, గ్రీన్ టెక్ వంటి 16 కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. 18–40 సంవత్సరాల లోపు వయస్సు కలిగి పదవ తరగతి నుండి ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు బయోడేటాతో పాటు ఒరిజినల్ లేదా జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9553356123, 9912115622, 9182335843 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సోమాపురంలో ఘర్షణ

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం గ్రామ సమీపంలోని పంట పొలాల వద్ద బుధవారం సాయంత్రం సుబ్బరామిరెడ్డి, రామచంద్రారెడ్డి వర్గీయుల నడుమ ఘర్షణ జరిగింది. ఇరువర్గాల మధ్య పొలాల వద్ద సాగునీటి పైపు లైన్ విషయమై తలెత్తిన సమస్యను పరిశీలించేందుకు బుధవారం తహసీల్దారు రమా కుమారి వెళ్లారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో చిన్నకొండారెడ్డి, భాస్కర్‌రెడ్డిలకు గాయాలు కాగా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు.

శానిటేషన్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు వెంటనే వేతనాలను చెల్లించాలని ఏపీ గవర్నమెంట్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి.రాఘవ కోరారు. బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 60 మంది శానిటేషన్ కార్మికులు పనిచేస్తున్నారని, వారికి రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. వారిలో కొంత మందికి పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు రూ.21,500 వేతనం పెంచాలని కోరారు. యూనియన్ అధ్యక్షురాలు రత్నమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, సహాయ కార్యదర్శి గంగాధర్, కోశాధికారి మహేష్ పాల్గొన్నారు.

పనుల పర్యవేక్షణ తప్పనిసరి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షిస్తుండాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపాలిటీలోని ఆయా విభాగాల సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యత తగ్గకుండా ఉండేందుకు మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. అలాగే పైపులైను లీకేజీలు, మరమ్మతులు వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వాటిని పరిష్కరించి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, డీఈఈ సుమన్‌రెడ్డి, ఏఈలు మహేష్, బాబు, జూనియర్ అసిస్టెంట్ వినోద్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు సరికాదు

కాశినాయన : రాజకీయ కారణాలతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం దారుణమని ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలశివ, జిల్లా అధ్యక్షుడు గజ్జల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన నరసాపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎటువంటి తప్పు చేయకపోయినా డ్వామా పీడీ తొలగిస్తున్నారని ఆరోపించారు. నోటిఫి కేషన్ లేకుండా, ఇంటర్వ్యూలు లేకుండా టీడీపీ నాయకులు చెప్పిన వారిని డ్వామా పీడీలు నియమించడం దారుణమన్నారు. ఎంఎస్‌పీ నాయకుడు ఓబయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

ప్రొద్దుటూరు : మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర మాలమహానాడు (రామాజీ వర్గం) జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ తెలిపారు. మాలమహానాడు, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాల మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వేధింపులు జరగకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆముదాల వలస నియోజకవర్గంలో సౌమ్యను మానసికంగా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధించడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుగాలి ప్రీతి హత్యకు కారణమైన వారిని శిక్షించాలని పేర్కొన్నారు. ముందుముందు ఇలాంటి ఇలాంటి సంఘటనలు జరిగితే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాష్ట్ర మాలమహానాడు నాయకులు సుద్దపల్లి మురళీప్రసాద్, అరుణ్‌కుమార్, మేకల ఓబులేసు, సంగటి పుల్లయ్య, సాత్రి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై కూటమి కుట్ర

ఈ ఫొటోలో కనిపిస్తున్న అబ్బాయి పేరు నల్లిబోయిన గణేష్. ఇతను తిరుపతిలోని దివ్యాంగ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇతనికి పుట్టుకతోనే చెవుడు, మూగ. ప్రతి నెల పింఛన్ కోసం తిరుపతి నుండి సొంత ఊరైన కానపల్లెకు వచ్చి పింఛన్ తీసుకుంటున్నాడు. అయితే ఇతను దివ్యాంగుడు కాదని, పింఛన్‌కు అర్హత లేదని తొలగించారని విద్యార్థి తల్లి శారద ఆవేదన వ్యక్తం చేశారు.



- రీ వెరిఫికేషన్ పేరుతో అనర్హత వేటు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు

ప్రొద్దుటూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తోంది. వివిధ పథకాల్లో కోత పెట్టడమే పనిగా పెట్టుకుంది. సర్వేల పేరుతో అర్హులను అనర్హులుగా ముద్రవేస్తోంది. ఇప్పుడు దివ్యాంగుల పింఛన్లకు ఎసరు పెట్టింది. దివ్యాంగ పింఛన్ల పరిశీలన పేరిట అర్హులకు అన్యాయం చేస్తోంది. ఏళ్లుగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు కొత్త నిబంధనల పేరుతో కొర్రీ పెడుతోంది. దివ్యాంగుల సదరం సర్టిఫికెట్‌కు రీ వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం దగా చేసిందని పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. వికలత్వ శాతం ఎక్కువగా ఉంటే రూ.15వేలు పింఛన్ ఇవ్వాల్సి వస్తుందని కుట్రపూరితంగా ప్రభుత్వం వికలత్వ శాతాన్ని తగ్గించి పింఛన్‌లో కోత విధించింది. కొందరికి 40 శాతం కంటే వికలత్వం తక్కువగా ఉందని పింఛన్‌ను రద్దు చేశారు. ప్రొద్దుటూరు మండలంలో మొత్తం 1,482 మంది దివ్యాంగులు నెలనెల పింఛన్ తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేసి వారిలో 207 మందిని గుర్తించి వారిలో వృద్ధాప్య పింఛన్లుగా మార్చారు. మిగిలిన 152 మందికి 40 శాతం కంటే తక్కువ వికలత్వం ఉందని పింఛన్‌ను రద్దు చేశారు. వీరికి నోటీసులు జారీ చేశారు. అయితే ఇప్పటికి 60 మంది తాము నిజమైన దివ్యాంగులమని దరఖాస్తు చేసుకున్నారు.



పింఛన్ రద్దు చేశారు

మా అమ్మ పెద్ద సుబ్బమ్మకు పుట్టుకతోనే మూగ, చెవుడు. రూ.50 నుంచి పింఛన్ తీసుకుంటూ గత నెల వరకు రూ.6వేలు పింఛన్ తీసుకుంది. అయితే మా అమ్మ దివ్యాంగురాలు కాదని నోటీసు ఇచ్చి పింఛన్ రద్దు చేశారు. మా నాన్న గంగన్న ఒకటిన్నర సంవత్సరం క్రితం చనిపోయాడు. వితంతువు పింఛన్‌కు కూడా మా అమ్మ అర్హురాలైనప్పటికీ ఏ పింఛన్ రాకుండా అనర్హురాలని తొలగించారు.

– కొడుకు గంగాధర్‌తో దివ్యాంగురాలు పెద్ద సుబ్బమ్మ, వసంతపేట, ప్రొద్దుటూరు

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణం



మాట్లాడుతున్న షాకీర్ హుస్సేన్

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వ రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లను తొలగించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ విమర్శించారు. బుధవారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ వద్ద ఆయన మాట్లాడుతూ అన్ని రకాల దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను కూటమి ప్రభుత్వం వైద్యాధికారులచే రీ వెరిఫికేషన్ చేయించిందన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో ఉన్న దివ్యాంగులందరికి కొత్త సదరం సర్టిఫికెట్లను ఇచ్చారన్నారు. ఈ సర్టిఫికెట్లను చూసిన దివ్యాంగులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. 90 శాతం వికలత్వం ఉంటే 75 శాతానికి తగ్గించారన్నారు. పర్సెంటేజీని తగ్గించడం వలన దివ్యాంగులు ఉద్యోగ అవకాశాల్లో తీవ్రంగా నష్టపోతారన్నారు. అనర్హులను గుర్తించి వారి పింఛన్లను తొలగించకుండా అర్హులకు ఇలా తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొన్ని సదరం సర్టిఫికెట్లలో లబ్ధిదారుల ఫొటోలకు బదులు వేరే ఫొటోలు ముద్రించారని, పేర్లు, వయసు తప్పుగా ముద్రించడంతో దివ్యాంగులకు తిప్పలు తప్పడం లేదన్నారు. రీ వెరిఫికేషన్ నిష్పక్షపాతంగా నిర్వహించి అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి నాయకులు అల్తాఫ్, రామసుబ్బయ్య, హనుమంత్, ఆసిఫ్ పాల్గొన్నారు.

ఏదీ.. అన్నదాత సుఖీభవ?



తహసీల్దార్ రమణమ్మకు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఖాజీపేట : ఎన్నికల కోడ్ ముగిసినా రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల కోడ్ కారణంతో ఖాజీపేట మండలంలోని ఒక్క రైతుకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం అందించలేదని తెలిపారు. ఎన్నికలు ముగిసినా రైతులకు నగదు జమచేయలేదని తెలిపారు. అలాగే వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. గతంలో మాజీముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వమే రైతులకు బీమా చెల్లించేదని తెలిపారు. కానీ కూటమి పాలనలో రైతులే బీమా చెల్లించే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ కనపర్తి సుబ్బారెడ్డి, సర్పంచ్ బుజ్జి, సుబ్బారెడ్డి, దుంపలగట్టు రామకృష్ణారెడ్డి, వెమకటరామిరెడ్డి, కొత్తపేట రామసుబ్బారెడ్డి, ఏటూరు శివారెడ్డి, సన్నపల్లె వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైవీ యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రొద్దుటూరు : యోగి వేమన యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బుధవారం ఆయన విద్యార్థులతో కలసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 700 ఎకరాల్లో రూ.కోట్ల బడ్జెట్‌తో యోగివేమన యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. అప్పట్లో సర్ సీవీ రామన్ సైన్స్ బిల్డింగ్, పరీక్షల విభాగం భవనం, హాస్టల్‌భవనాలు, గెస్ట్ హౌస్ రూ.70కోట్లతో పూర్తి కాగా మిగతా రూ.30కోట్లు అప్పటి అధికారుల నిర్లక్ష్యంతో వెనక్కి వెళ్లాయన్నారు. దీంతో అర్ధాంతరంగా మేనేజ్‌మెంట్ బిల్డింగ్, ప్రహరీ గోడ నిర్మాణ దశలో ఆగిపోయాయన్నారు. వైవీయూ ప్రణాళికలో భాగంగా వైస్ ఛాన్సలర్ బంగ్లాకు రూ.2.50 కోట్లు, రిజిస్ట్రార్ క్వార్టర్స్‌కు రూ.4.50కోట్లు, ఆడిటోరియం, స్కూల్, హెల్త్ సెంటర్ వీటన్నింటికీ కేటాయించగా అప్పటి యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్మాణానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎఫ్ నాయకుడు ఉమర్, విద్యార్థులు ఫరూక్, బాషా, ఈశ్వర్, శ్రావణి, ఇందు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

మైదుకూరు : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం తహసీల్దార్ రాజసింహ నరేంద్రకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రాహుల్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని కోరారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. హాస్టల్‌విద్యార్థులకు మెస్ మిల్లు రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు మైదుకూరుకు చదువుకునేందుకు వస్తున్నారని, వారికి ఇంత వరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీ ఇంత వరకు రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేరని, సౌకర్యాలు కూడా లేవన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, సుధీర్, తేజ పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు ప్రశంస

కడప అర్బన్ : అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులను కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ప్రశంసించారు. బుధవారం ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, మైదుకూరు డీఎస్పీ ఎస్‌వీబీ రాజేంద్రప్రసాద్‌కు జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ప్రశంసా పత్రాలు అందజేశారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, మైదుకూరు డీఎస్పీ ఎస్‌వీబీ రాజేంద్రప్రసాద్

హరిత ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న ఎంఈఓలు, హరిత ఫౌండేషన్ ప్రతినిధులు

కలసపాడు : ప్రభుత్వ విద్యారంగానికి, సమాజ శ్రేయస్సుకు హరిత ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కలసపాడు, కాశినాయన ఎంఈఓలు మస్తాన్‌వలి, ఓ.నిర్మల పేర్కొన్నారు. బుధవారం కలసపాడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మై వాయిస్ కార్యక్రమం నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానం పొందిన జెడ్పీహెచ్ఎస్ తెల్లపాడు విద్యార్థిని జైష్ణవికి రూ.5వేలు, ద్వితీయ స్థానం పొందిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని మల్లేశ్వరికి రూ.3వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఈ.రామాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కావ్యకు రూ.2వేలు నగదు బహుమతులు అందించారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి సిద్ధార్థ పాల్గొన్నారు.

కాశినాయన : నరసాపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం హైదరాబాద్‌కు చెందిన హరిత ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ ఫణిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అబ్దుల్ కలాం చేసిన సేవలు, ఆయనకు వచ్చిన అవార్డులు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి నరసాపురం పాఠశాల విద్యార్థి సబిహా, ద్వితీయ బహుమతి వరికుంట్ల కస్తూర్బా పాఠశాల విద్యార్థిని కావేరి, తృతీయ బహుమతి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి హర్షిత్ గెలుపొందారు.

వైద్యశిబిరానికి స్పందన

పోరుమామిళ్ల : గిరినగర్‌లో హోరేబు గ్లోరీ ప్లేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని పాస్టర్ పసుపుల అనిల్‌కుమార్ తెలిపారు. బద్వేలుకు చెందిన అమ్మ కంటి ఆసుపత్రి వైద్యబృందం శిబిరంలో పాల్గొని 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాషా మాట్లాడుతూ పేద ప్రజల కొరకు ఈ వైద్యశిబిరం నిర్వహించామని, కంటి శుక్లాలు ఉన్నవారికి కడప సీఎస్ఆర్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. పాస్టర్ అనిల్‌కుమార్, పాస్టర్ బాలయేసు, పాస్టర్ సల్మాన్‌రాజు, మినిస్ట్రీస్ సెక్రటరీ ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

టిడ్కో భవనాల పరిశీలన

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పరిశీలించారు. భవనాల ప్రస్తుత పరిస్థితిని టౌన్‌ప్లానింగ్ అధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. త్వరగా పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఆయన ఆదేశించారు.

9 మద్యం బాటిళ్లు పట్టివేత

కలసపాడు : మండలంలోని గోపవరంపల్లె గ్రామానికి చెందిన పినరాతు పుల్లయ్య వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిమోతి బుధవారం తెలిపారు. పుల్లయ్య చిల్లరంగడిలో మద్యం బాటిళ్లను విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకారం

చాపాడు : అల్లాడుపల్లె రైతు సంఘం(సొసైటీ) బ్యాంకు చైర్మన్‌గా మార్తల నరసింహారెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన సొసైటీ త్రీ మెన్ కమిటీ సభ్యులు మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి సన్నిధిలోని టీటీడీ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 1.30గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చైర్మన్‌గా నరసింహారెడ్డి, కమిటీ సభ్యులుగా వీరారెడ్డి, సుదర్శన్‌లు సొసైటీ అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి



కుందూనది వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఆర్డీఓలు

రాజుపాళెం : వినాయక నిమజ్జనాన్ని ప్రశాతంగా నిర్వహించుకోవాలని ప్రొద్దుటూరు డీఎస్పీ పి.భావన, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని వెల్లాల గ్రామ సమీపంలోని హైలెవెల్ వంతెన వద్ద నిమజ్జనం చేసే ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో పెద్దసంఖ్యలో భక్తులు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిమజ్జనం పూర్తయ్యేవరకు ఎంటువంటి సంఘటనలు చూడాలని చెప్పారు. ఎగ్జిట్, ఎంట్రీలను నిర్ణయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ గంగయ్య, ఎస్ఐ వెంకటరమణ, అరుణ్ రెడ్డి, ఆర్ఐ హుసేన్ రెడ్డి, వీఆర్‌ఓలు అశోక్, మధు రెడ్డి, పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

బద్వేలు అర్బన్ : వినాయకచవితి పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అర్బన్ సీఐ ఎస్.లింగప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఆయా కమిటీలు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాల వద్ద, నిమజ్జనం రోజున డీజేలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు నిర్వహించకూడదని కోరారు. ముఖ్యంగా నిమజ్జనాలకు వెళ్ళే సమయంలో ఎవరూ కూడా మత్తు పానీయాలు సేవించకూడదని, ఇందుకు నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసే నిమిత్తం నిర్వాహకులు అన్నిరకాల అనుమతులు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా మహిళలు ఆయా మంటపాలకు విలువైన ఆభరణాలు ధరించి వచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎయిడ్స్ బాధితులకు భరోసానిద్దాం



హెచ్ఐవీ గురించి వివరిస్తున్న అధికారులు, చైతన్య సొసైటీ సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు భరోసానిద్దామని చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ నరేష్‌కుమార్ అన్నారు. ప్రొద్దుటూరులోని యస్‌బీ మెమోరియల్ హైస్కూల్, నడింపల్లె మున్సిపల్ హైస్కూళ్లలో బుధవారం హెచ్ఐవీపై రాష్ట్ర స్థాయి క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధుల గురించిన సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు న్యాకో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ ఉన్నవారి పట్ల వివక్ష తగ్గించేలా ప్రజల్లో అవగాహన కలిగించడంతో పాటు ఎక్కువ మంది హెచ్ఐవీ పరీక్షలు చేయించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ అహమ్మద్‌హుస్సేన్, హెడ్‌మాస్టర్ షాహిదభాను, అధ్యాపకులు శ్రీలక్ష్మికుమారి, రాజ్యలక్ష్మి, మహమ్మద్‌గౌస్, నడింపల్లె మున్సిపల్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ అల్తాఫ్ అహమ్మద్, సిబ్బంది మోహన్ రెడ్డి, హుస్సేన్, పవన్, చైతన్య ఎడ్యుకేషనల్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పుల్లయ్య, ఓలమ్మ, సునీత, భాగ్యలక్ష్మి, వంశీ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కోర్టును సందర్శించిన జిల్లా జడ్జి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి యామిని

ప్రొద్దుటూరు క్రైం : ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి యామిని బుధవారం ప్రొద్దుటూరుకు కోర్టును సందర్శించారు. అనంతరం న్యాయవాదుల ఆహ్వానం మేరకు బార్ అసోసియేషన్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ పి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా జడ్జిని సత్కరించారు. కోర్టులోని పలు సమస్యలను న్యాయవాదులు జడ్జి దృష్టికి తెచ్చారు. కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, క్రిమినల్ కేసుల విషయంలో కడపకు వెళ్లి ఫైల్ చేసి రావాల్సి వస్తుందని జడ్జికి విన్నవించారు. ప్రొద్దుటూరు కోర్టులోనే క్రిమినల్ కేసులను ఫైల్ చేసేలా అవకాశం కల్పించాలని కోరారు. అలాగే పై అంతస్తులకు వెళ్లడానికి లిఫ్ట్ సౌకర్యం కల్పించాలన్నారు. న్యాయవాదులు అడిగిన వాటికి జిల్లా జడ్జి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో న్యాయమూర్తులతో పాటు సీనియర్ న్యాయవాదులు ముడిమేల కొండారెడ్డి, ఎన్ దాదాపీర్, మార్తల సుధాకర్‌రెడ్డి, మెట్టుపల్లి సుధాకర్‌రెడ్డి, లాలూసాబ్, నూరుల్లా, జిలాని, హరిస్వామి, చౌదురెడ్డి, చంద్రా, శ్రీనివాసులరెడ్డి, మారుతి పండిట్, సునీల్, లక్ష్మీప్రసన్న, విజయలక్ష్మి, రమాదేవి, ఓబులేసు, వెంకట్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జెండా దిమ్మెను తొలగించాలని ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మైదుకూరు : మైదుకూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ వారు ఏర్పాటు చేసిన జెండా దిమ్మెను, స్తంభాన్ని తొలగించాలని కోరుతూ బుధవారం ఎస్సీ సంక్షేమ సంఘం మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ తదితర ప్రజా సంఘాల వారు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అక్కడ కొద్ది సేపు బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి, టీడీపీ జెండా దిమ్మెను, స్తంభాన్ని తొలగించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో టీడీపీ వారు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ జెండా దిమ్మెను, స్తంభాన్ని కట్టారని, ఇది అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అడ్డంకిగా ఉందని పేర్కొన్నారు. దీనిపై తాము పలు మార్లు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా వారు తొలగించలేదని ఆరోపించారు. కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ జెండా కోసం దిమ్మెను, స్తంభాన్ని ఏర్పాటు చేయడం అంబేడ్కర్‌ను అగౌరవపరచడమేనని పేర్కొన్నారు. వెంటనే టీడీపీ జెండా దిమ్మెను, స్తంభాన్ని తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు కలమలమిట్ట విలియం, కనకరాజు, సీపీఐ నాయకులు శ్రీరాములు, భాస్కర్, పీరయ్య, మాలమహానాడు నాయకులు వసంత్ కుమార్, ఓబులేసు, ఐతా బాబు, కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు కైపు భాస్కర్, నాగార్జున, రమణ, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా దోమలను నివారిద్దాం

ప్రొద్దుటూరు క్రైం : కలిసి కట్టుగా దోమలను నివారించాలని శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి మధుకుమార్ తెలిపారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా శ్రీనివాసనగర్‌లో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమలు కుట్టడం ద్వారా మలేరియా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఆడ అనాఫిలస్ దోమలు మలేరియా పరాన్నజీవిని మోసుకుపోతాయని, ఇవి కుట్టినప్పుడు పరాన్నజీవి మనుషుల రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తుందన్నారు. సీఓ నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

బి. మఠంలో ర్యాలీ

బ్రహ్మంగారిమఠం : ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ ఎస్. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యవంతులను చేస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలకాటు వల్ల మలేరియా, చికెన్‌గున్యాతోపాటు ఇతర అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ ర్యాలీ బి.మఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వెంకటరెడ్డి, రామలక్ష్మమ్మ, వీర జ్యోత్స్న, విజయలక్ష్మి, ప్రేమ పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

ప్రొద్దుటూరు రూరల్ : ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలను నిర్వహించారు. సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సీహెచ్ఓలు నాగలత, దివ్య, లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు రూరల్ : అవగాహన ర్యాలీలో వైద్యులు, అధికారులు, సిబ్బంది

చాపాడు : మండలంలోని నక్కలదిన్నెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవంపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమల వలన కలిగే వ్యాధులు, దోమల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి డాక్టర్ కావ్య మాధురి అవగాహన కల్పించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్‌లు ప్రసాద్, భవాని, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎంలు శోభారాణి, ఆరోగ్య మేరి, ఆశా వర్కర్లు పోతులూరమ్మ, సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

బద్వేలు అర్బన్ : దోమల నివారణతో వ్యాధులు దూరం చేయడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి శరత్‌చంద్ర, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ భానుమతి, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధన్‌రావు, శ్రీరాములయ్య, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బి.కోడూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి వైద్య సిబ్బందికి, ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగీ, మెదడువాపు, బోదకాలు, ఫైలేరియా, చికెన్‌గున్యా వంటి విష జ్వరాలు వస్తాయని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, స్టాఫ్‌నర్సులు వేదవతి, సునీత, ఏఎన్ఎంలు కుమారి, మాధవి, రమాదేవి, భారతి, నూర్జహాన్, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.